క్లుప్తంగా

దేవాలయ భూములకు కౌలు వేలం



కాకరపర్రులో వేణు గోపాలస్వామి దేవాలయ భూములకు కౌలు వేలం నిర్వహిస్తున్న అధికారులు

పెరవలి: దేవాలయ భూములను కౌలు వేలంలో రైతులు, చురుకుగా పాల్గొనడంతో గతంలో కంటే ఆదాయం అధికంగా వచ్చిందని జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఈ సుబ్బారావు తెలిపారు. కాకరపర్రులో వేణు గోపాలస్వామి ఆలయానికి చెందిన 4.50 ఎకరాల భూమికి కౌలు వేలం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఈ భూములకు ఏడాదికి రూ.1.44 లక్షలు శిస్తు వచ్చేదని ఈ వేలంలో ఏడాదికి రూ.1.55 లక్షలకు పాట పాడుకున్నారని దీనితో గతంకంటే రూ.11 వేలు ఎక్కువ సమకూరిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మహేశ్వరరావు, ఆలయ మేనింజింగ్ ట్రస్ట్ సుబ్రహ్మణ్యం వర్మ , చిట్టూరి శేషగిరి, సంగీతం జయరాజు, పి మధు, చెర్ల శ్రీరామ చంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా రాజ్‌మనోహర్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన రాజ్‌మనోహర్

గోపాలపురం: కొత్తగా గోపాలపురం ఎంపీడీవోగా గెల్లా రాజ్‌మనోహర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇప్పటి వరకూ తూర్పుగోదావరి జిల్లా గండేపల్లి ఎంపీడీవోగా పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకూ ఇన్‌చార్జి ఎంపీడీవోగా శ్రీనివాస్ వ్యవహరించారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

దేవరపల్లి: పల్లంట్లలోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం 11 కేవీ టౌన్ ఫీడర్, అగ్రికల్చర్ ఫీడర్‌కు ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ నిడదవోలు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీని కారణంగా 11 కేవీ పల్లంట్ల ఫీడర్ వ్యవసాయ విద్యుత్‌ను ఉదయం 4 గంటల నుంచి 8.30 గంటల వరకూ ఇస్తామన్నారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చింతయ్య

దేవరపల్లి: నల్లజర్లలోని ప్రధాన కూడలి ప్రాంతంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి కారు ఢీకొంది. ఈ ఘటనలో మండలంలోని పుల్లలపాడుకు చెందిన కొక్కిరిపాటి చింతయ్య, దిర్సిపాం పండు గాయపడ్డారు. ఆయిల్‌పామ్ గెలలు కోయడానికి దేవరపల్లి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను చికిత్స కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా చింతయ్య ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది. ప్రమాద ఘటనపై ఫిర్యాదు అందలేదని నల్లజర్ల పోలీసులు తెలిపారు.

పంట మార్పిడితో భూసార పరిరక్షణ



శిక్షణ తరగతులలో పాల్గొన్న సహకార సంఘాల ప్రతినిధులు

రాజానగరం: పంటల మార్పిడి విధానాన్ని అవలంబించి సాగు చేయడం ద్వారా భూసారాన్ని పరిరక్షించడంతోపాటు మంచి దిగుబడులు పొందవచ్చని దివాన్‌చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ అన్నారు. కోనసీమ జిల్లాలోని 15 వ్యవసాయ సహకార పరపతి సంఘాల ప్రతినిధులకు సర్టిఫికెట్ కోర్సులో భాగంగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులలో శనివారం 'భూసారం పెంపుదలకు పంట మార్పిడి' అనే అంశంపై అవగాహన కలిగించారు. వివిధ రకాల పంటలకు ఎరువులను ఏవిధంగా వాడాలి, సేంద్రియ ఎరువుల వర్గీకరణ వంటి వాటిపై మరో శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకటనరసింహరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు

పెదపూడి: సంపర గ్రామంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారికి జ్యేష్ఠ మాసం బహుళ ఏకాదశి శనివారం సందర్భంగా పంచామృతాభిషేకం పూజలు చేశారు. ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు అధ్వర్యంలో స్వామివారికి తులసిదళాలతో విశేష, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారికి దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అసంపూర్తిగా సచివాలయ భవనాలు

- నిర్మాణ దశలోనే నిలిచిపోయిన భవనాలు
- 82కు 74 పూర్తి, పునాదుతో ఆగిపోయిన వెల్‌నెస్ సెంటర్లు
- నిరుపయోగంగా రైతు సేవా కేంద్రాలు



దేవరపల్లి మండలం యాదవోలులో నిరుపయోగంగా ఉన్న రైతు సేవా కేంద్రం



బందపురంలో ముళ్ల పొదలతో నిండి ఉన్న వెల్‌నెస్ సెంటర్ భవనం



బందపురంలో ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న గ్రామ సచివాలయ భవనం, రైతు సేవా కేంద్రం

దేవరపల్లి: ప్రజల ముంగిటకు పరిపాలన తీసుకువెళ్లి, అవసరమైన సేవలను సత్వరం అందించడంతో పాటు సమస్యలను పరిష్కరించడంలో ముందున్న గ్రామ సచివాలయ వ్యవస్థకు గ్రహణం పట్టింది. ఏడాది కాలంగా పలు గ్రామాల్లో సచివాల భవనాల నిర్మాణాలు నిలిచిపోయాయి. కొన్ని ప్రారంభోత్సవాలకు ఎదురు చూస్తున్నాయి. గోపాలపురం నియోజకవర్గంలో 2021-22 సంవత్సరంలో నాలుగు మండలాల్లో 81 గ్రామ సచివాలయ భవనాల నిర్మాణం చేపట్టారు. ఒక్కో భవనానికి అప్పటి ప్రభుత్వం సుమారు రూ.40 లక్షలు మంజూరు చేసింది. వీటితో పాటు రైతు భరోసా(సేవా) కేంద్రాలు, వెల్‌నెట్ సెంటర్ల భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. నాలుగు మండలాల్లో దాదాపు రూ.34.01 కోట్ల వ్యయంతో గ్రామ సచివాలయ భవనాల నిర్మాణం చేపట్టారు. 2023-24 సంవతరం నాటికి దాదాపు 90 శాతం భవనాల నిర్మాణం పూర్తికావడంతో ఎన్నికల ముందు హడావుడిగా ప్రారంభోత్సవాలు చేశారు. మిగిలిన 10 శాతం భవనాల నిర్మాణం పూర్తికాలేదు. ప్రస్తుతానికి ఈ భవనాల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం దేవరపల్లి మండలం బందపురం, దుద్దుకూరు-2, గౌరీపట్నం-2 గ్రామ సచివాలయ భవనాల నిర్మాణ పనులు పూర్తి కావడంతో ప్రారంభోత్సవాలకు సిద్ధం చేస్తున్నారు. యాదవోలు-2 గ్రామ సచివాలయ భవనం అసంపూర్తిగా ఉంది. దాదాపు రెండేళ్లుగా భవన నిర్మాణం నిలిచిపోయింది. గోపాలపురం మండలం దొండపూడి, రాజంపాలెం, వేళ్లచింతలగూడెం, కరగపాడు, గుడ్డిగూడెం, గోపాలపురం-2, గోపాలపురం-3 గ్రామ సచివాలయ భవనాల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. దేవరపల్లి మండలంలో బందపురం, గౌరీపట్నం -2, దుద్దుకూరు-2 గ్రామ సచివాలయ భవనాలు నిర్మాణం పూర్తి కావడంతో ప్రారంభోత్సవాలకు సిద్ధం ఉంది.

ఆగిపోయిన వెల్‌నెట్ సెంటర్లు

వెల్‌నెట్ సెంటర్ల నిర్మాణం పునాదులతో నిలిచపోయాయి. నియోజకవర్గంలోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో సుమారు 47 వెల్‌నెట్ సెంటర్లు మంజూరు కాగా, 24 భవనాల నిర్మాణాలు పూర్తి చేశారు. ఇంకా 23 నిర్మాణ దశలోనే ఉన్నాయి. దేవరపల్లి మండలంలో ఐదు పునాది దశలో నిలిచిపోగా, దుద్దుకూరు-2, దేవరపల్లి-2, చిన్నాయగూడెం-2, త్యాజంపూడి, లక్ష్మీపురం, యాదవోలు-2, దుద్దుకూరు-2 గ్రామ సచివాలయాల వద్ద చేపట్టిన భవన నిర్మాణాలు వివిధ దశలో అసంపూర్తిగా ఉన్నాయి. నల్లజర్ల మండలంలో ఏడు, గోపాలపురం మండలంలో 4, నల్లజర్ల మండలంలో 7, దేవరపల్లి మండలంలో 12 భవనాలు నిర్మాణం పూర్తికావాల్సి ఉంది.

> **మూడు గ్రామ సచివాలయాలు సిద్ధం**
>
> 
>
> మండలంలో మూడు గ్రామ సచివాలయ భవనాలు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. కాంట్రాక్టర్ జాప్యం వల్ల పనులు నిలిచిపోయాయి. బందపురం, గౌరీపట్నం, దుద్దుకూరు గ్రామాల్లో భవనాలు నిర్మాణం పూర్తికావడంతో ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నాం. యాదవోలు-2 గ్రామ సచివాలయ భవనం, రైతు సేవా కేంద్రం అసంపూర్తిగా ఉన్నాయి. వెల్‌నెట్ సెంటర్ల భవనాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఐదు భవనాల నిర్మాణం ప్రారంభం కాలేదు.
>
> – ఎస్‌కే షాజహాన్, ఏఈ, పీఆర్, దేవరపల్లి

నారుమడిలో ఎరువుల యాజమాన్య పద్ధతులు



ఉసులుమర్రులో నారుమడికి ఎరువులు వేస్తున్న రైతు

పెరవలి: ఆకుమడులు త్వరగా మొలకెత్తాలనే ఉద్దేశ్యంతో రైతులు ఎరువులు అధికంగా వేయడం, అలాగే తెగుళ్ల నివారణకోసం విశ్లేషణా రహితంగా పురుగు మందులను వినియోగిస్తున్నారని వ్యవసాయాధికారి మేరీ కిరణ్ తెలిపారు. సార్వా పంటలో ఆరోగ్యవంతమైన నారుమడి పెంచడానికి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎరువుల యాజమాన్య పద్ధతులు ఆమె వివరించారు.. నారుమడి వేసే 10 రోజుల ముందే దమ్ము చేసి చేనును చదును చేయాలి. నీరు పెట్టటానికి, తీయటానికి అనువుగా బోదెలను ఏర్పాటు చేయాలి. 5 సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని (ఒక కిలో విత్తనం చల్లే ముందు ఆ తరువాత విత్తిన 12 రోజులకు మరోకిలో చల్లాలి) ఒక కిలో భాస్వరం, ఒక కిలో పోటాష్ ఎరువులను దుక్కిలోనే వేయాలి. విత్తనాలు చల్లిన తరువాత మొలక వచ్చిన అనంతరం ఒక ఆకు పూర్తిగా విచ్చుకోనే వరకు ఆరుతడులు నీరు ఇచ్చి ఆ తరువాత పలచగా నీరును కట్టాలి. నారుమడిలో జింక్ లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి 2 గ్రాములు జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. విత్తిన 10 రోజులకు కార్బోఫ్యూరాన్ 3జి గులికలను సెంటు నారుమడికి 160 గ్రాములు చొప్పున వేయాలి లేదా నారుతీయటానికి 7 రోజుల ముందు గులికలను వేయాలి. అలాగే నాట్లు వేసేటప్పుడు నారుకట్టలుగా ఉన్నప్పుడే నారు ఆకుల చివర్లను తుంచి నాట్లు వేయాలి దీని వలన ఆకులపై ఉన్న తెగుళ్ల కారకాల గుడ్డు ముద్దలు నాశనం అవుతాయి. ఈ విధంగా నారుమడిని పెంచి నాట్లు వేసుకుంటే పంటకు తెగుళ్ల బెడద ఉండదని ఆమె వివరించారు.

దుర్గంధం భరించలేకపోతున్నాం

- నడుపల్లిలో ఇళ్ల మధ్యలో కోళ్లఫారాలు
- ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు



నడుపల్లిలో కోళ్లఫారాలను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ నిరంజన్, పొల్యూషన్ జిల్లా అధికారి సందీప్ రెడ్డి

పెరవలి: కోళ్ల ఫారాల నుంచి వచ్చే దుర్గంధాన్ని భరించలేకపోతున్నామని నడుపల్లి గ్రామస్తులు వాపోతున్నారు. ఈ ఫారాల నుంచి వచ్చే వ్యర్థాలు, దుర్వాసన వల్ల తీవ్ర అనారోగ్యం పాలవుతున్నామని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవటంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఎట్టకేలకు దీనిపై అధికారులు స్పందించారు. రెవెన్యూ, పంచాయతీ, జిల్లా పొల్యూషన్ పశుసంవర్ధక శాఖ అధికారులు నడుపల్లిలో విచారణ చేపట్టారు. గ్రామంలో ఇళ్ల మధ్య కోళ్లఫారాలు ఏర్పాటు చేయడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లడంతో ఉండలేకపోతున్నామని, చర్మవ్యాధులకు గురవుతున్నామని అధికారులకు చెప్పారు. దీంతో అధికారులు వారు చెప్పిన విషయాలను నమోదు చేసుకుని కోళ్లఫారాలను పరిశీలించారు. ఇక్కడకు వచ్చిన అధికారులు కూడా ఈ దర్వాసన భరించలేక పది నిమిషాలు కూడా నిలబడలేకపోయారు. దీంతో బాధితులు ఫిర్యాదు చేసి సమస్య వాస్తవమని తేలింది. దీనితో జిల్లా పొల్యూషన్ అధికారి సందీప్ రెడ్డి, పశుసంవర్ధక శాఖ డీడీ సత్యనారాయణ, జేడీ శ్రీనివాస్‌రావు కోళ్లఫారాల రైతులతో మాట్లాడి వెంటనే వాటిని తొలగించాలని, లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.నిరంజన్, ఆర్ఐ పావని, పశువైద్యాధికారి సల్మా, స్థానిక రెవెన్యూ, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

చాగల్లు: రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి వచ్చే నిత్యావసర సరకులను సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ ఎం .మెరికమ్మ రేషన్ షాపు డీలర్లకు సూచించారు. శనివారం తహసీల్దారు కార్యాలయంలో మండలంలోని డీలర్లతో ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకూ ప్రతి రోజు ప్రభుత్వం నిర్దేశించిన సమయాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు ఎఫ్‌పీ షాపులను తెరిచి ఉంచాలని రేషన్ డీలర్లను ఆదేశించారు. 65 సంవత్సరాలు పైన ఉన్న వారికి, దివ్యాంగులకు ఈ నెల 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు వారి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేయాలన్నారు. సివిల్ సప్లయిస్ డీటీ సునీత మాట్లాడుతూ డీలర్లు రేషన్ బియ్యం స్టాక్ పాయింట్ నుంచి తెచ్చుకునేటప్పుడు కచ్చితంగా తూకాలు వేసుకుని తెచ్చుకోవాలన్నారు. కార్డుదారులకు బియ్యం పంపిణీలో తూకాలు సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు కె.సత్యనారాయణ, కె.గణేష్, కె.కృష్ణ, శివ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌గా బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్‌గా కలెక్టర్ పి.ప్రశాంతి అదనపు బాధ్యతలను శనివారం స్వీకరించారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్‌లో చార్జ్ తీసుకున్నారు. ఇప్పటి వరకూ కమిషనర్‌గా భాధ్యతలు నిర్వహించిన కమిషనర్ కేతన్‌గార్గ్ విశాఖపట్నం బదిలీ అయిన విషయం విధితమే. ఈ మేరకు నూతన కమీషనర్ వచ్చే వరకు కలెక్టర్ ప్రశాంతి బాధ్యతలు నిర్వర్తించనున్నారు. కార్యక్రమంలో ఆర్ఎంసీ అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, మేనేజర్ ఎండి అబ్దుల్ మాలిక్ పాల్గొన్నారు.

నైపుణ్యం అద్భుతం

కడియం: మండలంలోని నర్సరీ రైతుల నైపుణ్యం అద్భుతమని ఆర్‌అండ్‌బీ శాఖామంత్రి మంత్రి బీ.జనార్దన రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండలంలోని కడియపులంకలోని పుల్లా ఆంజనేయులుకు చెందిన శ్రీ సత్యదేవ నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలికిన రైతులు వివిధ రకాల మొక్కలను గురించి వివరించారు. వేలాది రకాలను స్థానికంగా అభివృద్ధి చేస్తున్న రైతుల నైపుణ్యాలను మంత్రి అభినందించారు. అనంతరం మార్గాని సత్యనారాయణకు చెందిన శ్రీ వీరహనుమాన్ నర్సరీని కూడా మంత్రి సందర్శించారు.

జీజీయూలో ప్రపంచ హైడ్రోగ్రఫీ దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కోటేశ్వరరావు

రాజానగరం: పర్యావరణ పరిరక్షణలో కీలకపాత్రను పోషిస్తున్న హైడ్రోగ్రఫీ, ఓషనోగ్రఫీ కోర్సులను అభ్యసించే విద్యార్థులకు ఆయా రంగాల్లో అపార ఉపాధి, ఉద్యోగావకాశాలు ఉన్నాయని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) సివిల్ ఇంజినీరింగ్ హెచ్ఓడీ డాక్టర్ పి.వెంకట కోటేశ్వరరావు అన్నారు. జీజీయూలో సివిల్, మైనింగ్ విభాగాల ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ హైడ్రోగ్రఫీ దినోత్సవం జరిగింది. హైడ్రోగ్రఫీ, సముద్ర శాస్త్రాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మైనింగ్ హెచ్ఓడీ డాక్టర్ వై.వినోద్‌కుమార్ మాట్లాడుతూ సముద్ర వనరులను సమృద్ధిగా వినియోగించుకోవడంపై అవగాహన కలిగించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎస్ శర్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయితీపై డ్రోన్ల మంజూరు



దుద్దుకూరులో రైతు సంఘానికి రాయితీపై కిసాన్ డ్రోన్ అందజేస్తున్న వ్యవసాయాధికారులు

దేవరపల్లి: పంటలకు పురుగు మందులు పిచికారీ చేయడానికి సన్న, చిన్నకారు రైతులకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ కిసాన్ వికాస్ యోజన (ఆర్‌కేవీవై)లో వ్యవసాయ శాఖ ద్వారా 80 శాతం రాయితీపై కిసాన్ డ్రోన్లను అందజేస్తుందని మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ తెలిపారు. దుద్దుకూరులో శ్రీపద్మావతి స్వయం సహాయక సంఘానికి కిసాన్ డ్రోన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కమల్‌రాజ్ మాట్లాడుతూ మండలానికి రెండు కిసాన్ డ్రోన్లు మంజూరయ్యాయన్నారు. మొదటి డ్రోన్ దుద్దుకూరులోని రైతు సంఘానికి మంజూరు చేసినట్టు వివరించారు. డ్రోన్ ఖరీదు రూ. 10 లక్షలు కాగా, ఇందులో రూ.5 లక్షలు గ్రేప్‌లో రైతుల వాటా, రూ. 5 లక్షలు బ్యాంకు రుణం ఉంటుందన్నారు. ఈ మొత్తంలో 80 శాతం ప్రభుత్వం రాయితీ ఇస్తుందని, 20 శాతం రైతు సంఘం చెల్లించాల్సి ఉంటుందన్నారు. గ్రామాల్లోని సన్న, చిన్నకారు రైతులు ఐదుగురు గ్రూపుగా ఏర్పడి వ్యవసాయ శాఖ అధికారులకు తీర్మానం అందజేయాలన్నారు. ఐదుగురు రైతుల్లో చదువుకున్న రైతుకు నిర్వహణపై శిక్షణ ఇచ్చి కిసాన్ డ్రోన్ అందజేస్తారన్నారు. 10 లీటర్ల పురుగు మందు ద్రావణాన్ని ఎకరానికి 10 నిమిషాల్లో డ్రోన్ పిచికారీ చేస్తుందన్నారు. ఆసక్తి గల రైతులు వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణాధికారి సీహెచ్ సంజన, గ్రూప్ కన్వీనర్ గారపాటి రామకృష్ణ, కో-కన్వీనర్ గారపాటి మురళి తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా అంతర్జాతీయ యోగా దినోత్సవం

యోగా సాధనలో పాల్గొన్న విద్యార్థులు, ప్రజలు



కొవ్వూరులోని గోష్పాద క్షేత్రం వద్ద గోదావరిలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, తదితరులు



వేగేశ్వరపురంలో యోగా గురువు నక్కా వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న డీఎల్‌పీవో, ఇతర అధికారులు



చాగల్లు హైస్కూల్‌లో యోగాంధ్ర ఆకృతిలో విద్యార్థులు



యోగాసనాలు వేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ, యోగా సాధకులు

దేవరపల్లి: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం మండలంలో గ్రామగ్రామాన శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, గ్రామ సచివాలయాల వద్ద యోగాసనాలు వేశారు. అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు యోగా కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు వేశారు. ఉదయం 7.30 గంటల నుంచి 9.30 గంటల వరకు ఈ కార్యక్రమం జరిగింది. యోగాసనాల గురించి, యోగా వల్ల శారీరక ప్రయోజనాలను ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు వివరించారు. దేవరపల్లి అంబటి సత్యనారాయణరావు జిల్లా పరిషత్ హైస్కూలు వద్ద నిర్వహించిన యోగా కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నిట్టా రవికిషోర్, ప్రధానోపాధ్యాయుడు ఐ.సూర్యనారాయణ, ఫిజికట్ డైరెక్టర్ ఓరుగుంటి రామకృష్ణం రాజు, వ్యాయామ ఉపాధ్యాయుడు ఓరుగుంటి నాగరాజు, టీడీపీ నాయకులు గన్నమని జనార్దనరావు, ఉప్పులూరి రాంబాబు, విద్యాకమిటీ చైర్మన్ వేముల రాజు, మాజీ సర్పంచ్ కాట్రు భీమరాజు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. స్థానిక పూర్ణయోగా అధ్యాత్మిక యోగ ప్రచార సంస్థ వ్యవస్థాపకులు వెలగా రామచంద్రం గురూజీ అధ్వర్యంలో యోగ శిక్షకులు గ్రామంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. పూర్ణ యోగ ఆశ్రమంలో యోగ సాధకులు పలు ఆసనాలు వేశారు.

తాళ్లపూడి(కొవ్వూరు): యోగా అందరూ ప్రతిరోజు ఆచరించాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు లోని గోష్పాద క్షేత్రం వద్ద 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యోగా డే సందర్భంగా గోదావరి నదిలో పలువురు యోగాసనాలే వేశారు. అనంతరం పలువురికి బహుమతులు అందజేశారు. యోగా గురువలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కీ నాగేంద్ర, ఆర్డీవో కార్యాలయ ఉద్యోగులు నిరంజన్, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మన ఆరోగ్యం కోసం నిత్య జీవితంలో యోగా సాధన, ధ్యానం ఒక అలవాటుగా చేసుకోవడం ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని యోగా గురువు నక్కా వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని పలు చోట్ల అంతర్జాతీయ యోగా దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. వేగేశ్వరపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌పీవో వై.అమ్మాజీ, ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, తహసీల్దార్ ఎన్ లక్ష్మి లావణ్య, సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామరావు, ఎంఈవో సీహెచ్ బాలామణిల చేతుల మీదుగా గత తాళ్లపూడిలో 43 సంవత్సరాలుగా ఉచితంగా యోగా నేర్పుతున్న యోగా గురువు నక్కా వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. మండలంలో మలకపల్లి, పెద్దేవం, గజ్జరం, తాళ్లపూడి, పెద్దేవం ఉన్నత పాఠశాలల వద్ద, తాళ్లపూడిలోని మండల పరిషత్ ప్రత్యేక ప్రాథమిక పాఠశాల వద్ద యోగా డే నిర్వహించారు.

పెరవలి: శారీరక సమస్యలు, మానసిక రుగ్మతలు పోగొట్టేదే యోగా అని, దీనిని నిత్య జీవితంలో అలవాటు చేసుకోవాలని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని 18 గ్రామాల్లో స్వచ్ఛందంగా 35,401 మంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.పద్మజ, తహసీల్దార్ కె.నిరంజన్, మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

చాగల్లు: మండలంలో యోగాడేను శనివారం ఘనంగా నిర్వహించారు. చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జరిగిన సభకు పాఠశాల హెచ్ఎం వాసవీ అధ్యక్షత వహించారు. వ్యాయమ ఉపాధ్యాయులు జె.విజయలక్ష్మి వివిధ రకాల యోగాసనాలు గురించి తెలిపారు. ఊనగట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కూడా యోగాడేను నిర్వహించారు.

నిడదవోలు : పట్టణంలోని గణపతి సెంటర్ ఐ లవ్ నిడదవోలు పార్కు వద్ద మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉద్యోగులు, ప్రజలు, వివిధ రాజకీయ నాయకులు యోగా సాధన చేశారు. ఈసందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలిపొందిన వారికి మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. యోగా గురువులు సానేపు సుబ్బరావు, రేష్మలను సత్కరించారు. నిడదవోలు పట్టణానికి యోగాను పరిచయం చేసిన వైద్యులు బూరుగుపల్లి అప్పారావు రచించిన సంపూర్ణ ఆరోగ్య నియమావళి అనే పుస్తకాన్ని చైర్మన్ ఆదినారాయణ ఆవిష్కరించారు. మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణవేణి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్‌కే వజీరుద్దీన్, నాయకులు, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

గోపాలపురం: నిత్య యోగా సాధనతో ఆరోగ్యంగా ఉంటారని ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాసనాలు వేశారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.శ్రీనివాసరావు, మండల విద్యాశాఖ అధికారి జి.శ్రీనివాసరావు, హెచ్ఎం ఎం.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఆరోగ్య యోగమే..

నిడదవోలు రూరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే రోజు యోగా చేయాలని ఎంపీడీఓ జగన్నాథరావు సూచించారు. తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయ ప్రాంగణంలో యోగాసానాలు వేశారు.



కొవ్వూరులోని గోష్పాద క్షేత్రం వద్ద జరిగిన యోగా దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే, డిగ్రీ విద్యార్థులు తదితరులు



కానూరు పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



పెరవలిలో ప్రత్యేక అధికారి, ఎంపీపీ, ఎంపీడీఓ ఆధ్వర్యంలో యోగా చేస్తున్న అధికారులు, విద్యార్థులు, నాయకులు



అమృతమూర్తికి అశ్రునివాళి

సదా మా శ్రేయస్సే ధ్యేయంగా, చెరగని చిరునవ్వుతో - మా అందరికీ ప్రేమ, అనురాగం, ఆప్యాయతలు పంచిన మీరు సదా మా హృదయాలలో కలకాలం నిలిచి ఉంటారు. భగవంతుని దివ్య సన్నిధికి చేరిన మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ.శే. శ్రీమతి పంచకర్ల మంగతాయారు గారు

జననం : 08-04-1948 మరణం : 10-06-2025

భర్త : పంచకర్ల సత్యనారాయణ (A2,PA)

కుమారులు: పంచకర్ల దుర్గాప్రసాద భూషణ్ M.tech, పంచకర్ల నాగేంద్ర నిరంజన్ B.A

కోడళ్ళు: మాధవి M.A, ఉదయ లక్ష్మీకుమారి B.A

కుమార్తె: అవ్వల చిట్టిబసవేశ్వరి M.Com

అల్లుడు: అవ్వల రమణ కుమార్ M.B.A

మనుమలు - మనుమరాండ్రు: అవ్వల భానువర్ధన్ M.S (U.S.A), పంచకర్ల పత్యతేజ B.Tech, పంచకర్ల సాయిసూర్య ప్రదీప్ B.Sc, అవ్వల కావ్య M.Tech, పంచకర్ల మంగీష BHM

పెద్దకార్యం : ది.23-06-2025 అనగా సోమవారం భీమడోలు మండలం, సూరప్పగూడెంలోని మా స్వగృహము నందు జరుగును.